నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | ఆగస్టు 11, 2024 | www.navatelangana.com

## గుంతను పూడ్చిన పోలీసులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బాన్సువాడ ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో రామలింగం బావి సమీపంలో రోడ్డుపై కల్వర్టు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతను శనివారం ఎల్లారెడ్డి పోలీసులు మొరంతో పూడ్చివేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఈ గుంట చాలా ప్రమాదకరంగా మారిందని, దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించి ఆర్ అండ్‌బి శాఖ సిబ్బంది దీనిని పట్టించుకోకపోవడంతో పోలీసులే స్వయంగా పూడ్చివేశారని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెట్రోలింగ్ ఏఎస్ఐ విజయ, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ రెడ్డి, అంజనేయులు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.


గుంతను పూడ్చుతున్న పోలీసులు

## ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గింది. శనివారం 3333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5 టీఎంసీల)కు గాను ప్రస్తుతం 1080.80 అడుగుల(47.25 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1090.10 అడుగుల(77.289 టీఎంసీల) నీరు నిల్వ ఉండే.



# ప్రమోషన్‌లో పైరవీలు

- ఆర్టీసీలో అక్రమంగా ప్రమోషన్
- నకిలీ కుల ధృవీకరణతో పలువురికి ఏడీసీగా ప్రమోషన్
- ట్రెయినింగ్ పూర్తయి విధుల్లో చేరిన వైనం
- నష్టపోయిన అర్హులు
- ఫిర్యాదు అందలేదంటు విజిలెన్స్ దాటవేత..?
- విచారణ చేపడితే అక్రమాలు బయటపడే అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఆర్టీసీలో ఇటీవల పలువురు కండక్టర్‌లకు, డ్రైవర్‌లకు ఏడీసీలుగా ప్రమోషన్ కల్పించారు. రిజర్వేషన్‌ల ఆధారంగా ప్రమోషన్‌లు ఇచ్చారు. వీరికి ఇటీవల వరంగల్‌లో ట్రెయినింగ్ సైతం పూర్తయి ఇటీవల విధుల్లో చేరారు. అయితే ప్రమోషన్‌లలో అక్రమాలు చోటుచేసుకున్నట్టు సమాచారం. పలువురు ఉద్యోగులు నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా ప్రమోషన్‌లు పొందినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తాము నష్టపోయామని పలువురు అర్హులు వాపోతున్నారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో ప్రమోషన్ పొందిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఆర్టీసీ విజిలెన్స్ విభాగం మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే విచారణ చేపడతామని



పేర్కొనడం గమనార్హం.

ఆర్టీసీలో నిజామాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం ఆరు డిపోలు ఉన్నాయి. నిజామాబాద్ -1, 2తో పాటు బోధన్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడలో డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలోని డ్రైవర్‌లతో పాటు కండక్టర్‌లకు అసిస్టెంట్ డిపో క్లర్క్/ కంట్రోలర్(ఏడీసీ)గా ప్రమోషన్‌లు కల్పించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. రీజియన్ పరిధిలో మొత్తం 25 మందికి ఏడీసీగా ప్రమోషన్ కల్పించారు. ప్రమోషన్‌లో భాగంగా రిజర్వేషన్ ఆధారంగా పలువురికి ప్రమోషన్ వచ్చింది.

**నకిలీ కులధ్రువీకరణతో ప్రమోషన్**

కాగా ప్రమోషన్‌లలో అక్రమాలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో ఓ డిపోకు చెందిన ఉద్యోగి నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో ప్రమోషన్ పొందినట్టు సమాచారం. ప్రమోషన్‌లు కల్పించే సమయంలో కనీస ఎంక్వైరీ లేకపోవడంతో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నట్టు దళితసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో సైతం ఇదే విధంగా పలువురు ఉద్యోగులు నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో ప్రమోషన్ తీసుకొని.. తమ బండారం ఎక్కడ బయటపడుతదో అని భయాందోళనతో మధ్యలో వాలంటీర్ రిటైర్‌మెంట్ తీసుకోవడం గమనార్హం. ఇటీవల సైతం ఓ ఉద్యోగి నకిలీ కుల సర్టిఫికేట్‌తో ప్రమోషన్ పొందినట్టు తేలడంతో సదరు ఉద్యోగికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను ఆర్టీసీ సంస్థం నిలిపివేసింది. హైకోర్టుకు వెళ్లిన ఎలాంటి ప్రయోజనం సైతం దక్కలేదు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకున్నారో ఏమో కానీ.. నకిలీ సర్టిఫికేట్‌లతో ప్రమోషన్‌లు పొందుతున్నారని, అలాంటి వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలనాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ప్రమోషన్‌లు పొందిన వారిపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఆర్టీసీ విజిలెన్స్ స్పందించి విచారణ చేపడితే అక్రమాలు బయటపడే అవకాశం ఉందని, తమకు అవకాశం వస్తుందని ప్రమోషన్‌కు అర్హులైన పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

**మా దృష్టికి రాలేవు : ఆర్ఎం కె.జానిరెడ్డి**

సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేసి పారదర్శకంగా ప్రమోషన్‌లు కల్పించాం. గతంలో కూడా 70 మందికి ప్రమోషన్‌లు ఇచ్చాం. ఇప్పుడు అవకాశం రావడంతో మరో 25 మందికి ప్రయోజనం కల్పించాం. అక్రమాలు జరిగినట్టు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేవు. అలా ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకొస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

## నిజామాబాద్ మున్సిపల్ అవినీతికి కేరాఫ్‌గా మారింది

- మరిన్ని అవినీతి తిమింగిలాలు ఉన్నాయి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ మున్సిపాలిటీ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్డాగా మారిందని తాను గెలిచినప్పటి నుండి ఇదే విషయంపై పలుమార్లు హెచ్చరించినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మున్సిపల్ అధికారి ఇంట్లో జరిగిన ఏసీబీ దాడుల్లో 6 కోట్లకు పైగా నగదు, పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తుల దస్తవేజులు దొరకడమే ఇందుకు నిదర్శనం అని, మున్సిపల్ వివిధ శాఖల్లో అవినీతి తిమింగిలాలు ఇంకా ఉన్నాయని మునిసిపల్ అవినీతి ప్రక్షాళన ఇంకా జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ అవినీతి పరులైన అధికారులు ఉన్నంత కాలం సామాన్యులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షల మిగిలిపోతా యాని అన్నారు. మునిసిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కిందిస్థాయి అధికారులపైన శాఖల పైన ఎప్పటికప్పుడు న్యాయ సమీక్షా నిర్వహించుకొని ప్రజలకు న్యాయబద్ధమైన పాలన అందించాలని కోరారు. అలాగే నగర ప్రజల నుండి దోచుకున్న ప్రతి పైసా నగర అభివృద్ధికే ఖర్చుపెట్టాలని ఆ సొమ్ముపై నగర ప్రజలకే హక్కు ఉంటుందని ఏసీబీ అధికారులు రికవరీ చేసిన అక్రమ ఆస్తులు తిరిగి మునిసిపల్ ఖాతాలో జమచేసి అభివృద్ధికి ఖర్చు చేయాలనీ డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ధన్‌పాల్

## మున్సిపల్ నరేందర్‌కు 14రోజుల రిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన నిజామాబాద్ మున్సిపల్ ఆర్వో నరేందర్‌కు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. శుక్రవారం సాయంత్రం నరేందర్‌ను అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. కాగా 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం నరేందర్‌ను జైలుకు తరలించారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నట్టు ఆరోపణలు రావడంతో ఏబీసీ అధికారులు నరేందర్ ఇంటిపై రైడ్ చేసి నగదు, బంగారం స్వాధీనం చేసుకున్న విషయం విధితమే.



## రోడ్డు గుంతల మయం

- తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడటంతో గుంతను తప్పించేందుకు రాంగ్‌రూట్ నుంచి రైట్ రూట్‌కు వెళ్తున్న కారు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండల కేంద్రంలోని బాన్సువాడ, నిజామాబాద్, బోధన్ వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద, బొమ్మాన్ దేవ్‌పల్లి చౌరస్తా వద్ద మోకాలు లోతు గుంతలు ఎర్పడంతో శనివారం ముందు వెళ్తుతున్న ఓ కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న మోటార్ సైకిల్ ఢీ కొనడంతో దంపతులు మురికి గుంతలో పడ్డారు. మూడు రోజుల క్రితం ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీనితో ఓ ఉద్యోగి గాయపడ్డాడు. ఇలా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై గుంతలను పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలి
- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని టిఎస్‌యుటిఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలో టిఎస్‌యుటిఎఫ్ పతాకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ మాట్లాడుతూ.. '1974 ఆగస్టు 10న ఆవిర్భవించిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వర్ణోత్సవాలు జరుపుకుంటుంది. యుటిఎఫ్ ఉపాధ్యాయ ఉద్యమాన్ని శిఖరాగ్రాన నిలిపి ఐక్య ఉద్యమాలు నిర్మించి, ప్రముఖ విద్యావేత్తలు చుక్కారామయ్య ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, లక్ష్మణ్ రావు, బాలసుబ్రమణ్యం లాంటి 9 మందిని ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఏంఎల్‌సిలుగా గెలిపించుకొని, ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేలు సాధించడం, అప్రెంటిస్ విధానం రద్దు, రెండు సంవత్సరాల కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడం, 2008లో 13 రోజుల సమ్మె జయప్రదం చేయడం, 2009లో ఉపాధ్యాయులకు 32వేల పదోన్నతులు సాధించడం, 2005 నుండి సిపిఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్తో మూడుసార్లు చలో పార్లమెంట్, రాష్ట్ర స్థాయిలో పలు ధర్నాలు నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించి సెప్టెంబర్ 1ని పెన్షన్ విగ్రహ దినంగా పాటిస్తూ నిరంతరం పోరాటం చేస్తూ వచ్చింది.'

తెలంగాణ రాష్ట్రంలో విద్యాయాత్ర నిర్వహించి ప్రాథమిక పాఠశాలలకు తరగతి ఒక టీచర్, తరగతికి ఒక గది ఉండేటట్టుగా అభివృద్ధి చేసి, ఇంగ్లీష్ మీడియం ప్రారంభించాలని డిమాండ్ చేసింది. ఫలితంగా ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించింది, కోవిడ్ సమయంలో వలస కార్మికులకు ఉపాధ్యాయుల ద్వారా విరాళాలు సేకరించి నిత్యవసర సరుకులు పంపిణీ చేసింది. లాక్‌డౌన్ సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని తల్లిదండ్రులను సంప్రదించి సర్వే నిర్వహించి ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి ఆన్‌లైన్ క్లాసులను ప్రారంభించడానికి కృషి చేసింది. విద్యారంగానికి మరింత నిధులు పెంచి అన్ని పాఠశాలల్లో మెరుగైన భౌతిక సౌకర్యాలు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డి.ఏ.లు వెంటనే ప్రకటించాలని, పిఆర్సి నివేదికను బహిర్గతపరిచి 30శాతం ఫిట్మెంట్‌కి తగ్గకుండా పిఆర్‌ఎస్ ఇవ్వాలని' డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ నిజామాబాద్ జిల్లా ట్రెజరర్ ఎమ్.మల్లేష్, జిల్లా కార్యదర్శులు జి.గంగాధర్, ఎస్.రాజారామ్, వి.సాయన్న, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్.బాజన్న, ఎస్.భూమేశ్వర్, సోన్‌పేట్ గంగాధర్, ఎల్.శంకర్, టి.కపిల్ దేవ్, ఎమ్.రవీందర్, లక్ష్మి శైలజ, పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు

## విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి


మృతదేహం పంచనామ నిర్వహిస్తున్న పోలీసులు


చిరంజీవులు(ఫైల్)

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన మామిడి చిరంజీవులు(54) తన భార్యతో పాటుగా పొలానికి మందుచల్లేందుకు వెళ్లాడు. పని మధ్యలో దాహం వేయడంతో నీరు తాగేందుకు బోరు చాలు చేద్దామని వెళ్లాడు. బోరు స్టార్టర్ బాక్స్ పాడవడంతో దానిని సరిచేసేందుకు తన పొలం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ హ్యాండిల్ పట్టుకొని ఆఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి చిరంజీవిలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య సంగీత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు.



కెరళ వరదబాధితుల సహాయార్థం విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

## కేరళ వరద బాధితులకు సీఐటీయూ విరాళాలు సేకరణ

నవతెలంగాణ-వర్ని(చందూర్ )

కేరళ వరద బాధితులకు సహాయార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం చందూర్ మండల కేంద్రంలో విరాళాల సేకరణ చేపట్టారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరాళాలు సేకరణ చేస్తున్నామని కార్మిక నేత నన్నెసాబ్ తెలిపారు. ప్రకృతి విలయ తాండవంలో వరదల్లో వందల మంది చిక్కుకొని కేరళ ప్రజలు మరణించటం బాధాకరం అన్నారు. వరదలలో మృతి చెందిన కుటుంబాలను మానవత్వంతో విరాళాలు అందించి మానవత్వం చూపాలని కోరారు. రాజకీయలకతీతంగా, ప్రజా, యువజన, మహిళా సంఘాలు,సామాజిక, విద్యార్థి సంఘాలు విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సాయిబాబా,భూమయ్య,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు

నవతెలంగాణ-ఎడపల్లి

కూర్నాపల్లి గ్రామ బస్టాండ్ వద్ద రూర్బన్ పథకం కింద ఐదు లక్షల రూపాయలతో చేపట్టిన కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నికలు రావడంతో కోడ్ నేపథ్యంలో నిర్మాణ పనులు నిలిపివేశారు. అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికలు పూర్తవడంతో పనులు చేపట్టొచ్చని ఇటీవల ఉన్నతాధికారులు సూచించడంతో పనులు పునఃప్రారంభమైయ్యాయి. నాణ్యత ప్రమాలతో పనులు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులను ఎప్పటికప్పుడు గ్రామ పెద్దలు. పర్యవేక్షిస్తున్నారు.

# ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

- ఇంటి నంబర్ల కేటాయిస్తూ అక్రమంగా రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ డివిజన్‌లో అవినీతి అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా అవుతున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తు న్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి అనుమతులు తీసుకోకుండా నేరుగా ఇంటి నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించి విక్రయిస్తున్నారు. శిఖం భూముల్లో సైతం నిర్మాణాలు జరుపుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమ నిర్మాణాలకు ఇంటి నంబర్లు**

నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామాల్లో ప్రభుత్వ అసైన్డ్ భూములకు ఎలాంటి లింకు డాక్యుమెంటు లేకుండానే ఇంటి నంబరు ఇచ్చారు. సదరు వ్యక్తి రిజిస్ట్రేషన్ సైతం చేయించుకొని ఇందులో ఒకటి విక్రయించారు. సాయి బాబా ఆలయం ఎదుట ఉన్న కొన్ని ఇండ్ల స్థలం ప్రభుత్వ భూమి తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాట్స్ చేసి కొందరు విక్రయించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేక పోయినా ఇంటి నంబరు ఇచ్చారు. దీనితో మరో వ్యక్తికి విక్రహించి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఎలాంటి నివాసం లేక పొయిన తాత్కాలిక రేకుల షెడ్డు చేసిన వాటికి ఇంటి నంబర్ కేటాయించడంతో విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేసి అధిక ధరలకు విక్రయిస్తు న్నారు. దుర్కి గ్రామాల్లో ప్రభుత్వ భూమిలో రెండు అక్రమ కట్టడాలకు ఇంటి నెంబర్లు ఇచ్చారు.

దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములను కొందరు ఇష్టానుసారం ప్లాట్లు చేసి విక్రయిస్తు న్నారు. బస్వాయి పల్లి శివారు భూములను ఇళ్ల స్థలాలుగా మార్చి వాటికి ఇంటి నెంబర్లు కేటాయిం చ దాంతో అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లను సులువు చేసేస్తున్నారు. మరి కొందరు చిన్న గుంటలు చేసి విక్రయిస్తు న్నారు. అందులో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఇండ్ల నిర్మాణం చేపడుతు న్నా రు. గతం లో గ్రా మ పంచాయతీకి కేటాయించిన స్థలాలు సైతం విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఇంత తతంగం జరుగుతున్న మున్సిపల్ , గ్రామ పంచాయతీ అధికారులు కన్నెత్తి కూడా చూడరని విమర్శలు వస్తున్నాయి.

**బాన్సువాడ పట్టణంలో**

బాన్సు వాడ మున్సిపల్ లో మున్సిపల్ కు చెందిన భూమికి రెక్కలు వచ్చాయి. నాల కన్వెన్షన్ చెయ్యకుండా, మున్సిపల్ నుంచి అనుమతి లేకుండా నిర్మించిన ఇంటికి ఇంటి నంబరు ఇచ్చారని, బీడీ కాలోని వద్ద ఉన్న చెరువు శిఖం భూమిని కొందరు కబ్జా చేస్తూ ప్లాట్స్ చేస్తున్నారని ఆరోపణ ఉంది. వరద కాలువలు పూర్తిగా కబ్జా చేశారు. వర్షాకాలం కురసిన వర్షం నీరు వరద కలువ ద్వారా వెళ్ళేది. ఇప్పుడు వరద కాలువలు కబ్జా చెయ్యడంతో వరదనీరు ఇండ్ల లోకి వస్తుంది.


నసురుల్లాబాద్‌లో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు



**మా దృష్టికి రాలేదు..**
**సూర్య కాంత్ ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ నసురుల్లాబాద్**

ఖాళీ స్థలాలకు, అక్రమ వెంచర్లలోని ప్లాట్లకు నూతన ఇంటి నెంబర్లు కేటాయిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా.. మా హయాంలో అక్రమ ఇంటి నెంబర్ల కేటాయింపు జరగలేదు. ప్రజలు మా దృష్టికి తీసుకొస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం. భూవ్యాపారులు డీటీసీపీ లేఅవుట్‌తో అనుమతులు పొందాలి. డీటీసీపీ అనుమతులున్న వెంచర్లలో ప్రజలు స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా మోసాలకు తావుండదు.

## కొనసాగుతున్న ఇంటింటి సర్వే



**నవతెలంగాణ-బాల్కొండ**

మండల కేంద్రంలో సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి ఆధ్వర్యంలో పోచమ్మ గల్లీలో సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. శనివారం సర్వేలో భాగంగా కాలనీవాసులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాలనీలోని అంతర్గత రోడ్లలో నిలువ ఉన్న మురికి నీళ్లపై ఆయిల్ బాల్ వేశారు. అనంతరం దోమల మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మేరమ్మ ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిని కలిసిన ఓబీసీ నాయకులు



మంత్రిని సన్మాంచిన ఓబీసీ నాయకుడు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని మర్యాదపూర్వకంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మదాసు స్వామి యాదవ్ హైదరాబాద్‌లో కలిసారు. బండి సంజయ్, స్వామి యాదవ్‌ని సంబోధిస్తు పార్టీ బలోపేతం కోసం పని చేయలని, కష్టపడి పనిచేసే కార్యకర్తలను పార్టీ ఎప్పుడు ప్రోత్సహిస్తుందని అన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఆగి ఉన్న లారీని ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని అర్సపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాల ప్రకారం.. నగరంలోని నిజాం కాలానికి చెందిన అన్వర్(42) అర్సపల్లి బైపాస్ నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లేమార్గ మధ్యంలో ఆగివున్న లారీని బైక్‌తో ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

## దోమల నివారణ చర్యలు



దోమల నివారణకు పిచికారి

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు శనివారం చేపట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ వడ్డెర కాలనీలో, ఖాళీ ప్రదేశాల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది గ్రామంలో వర్షం నీరు నిలిచిన గుంతల్లో, మురికి కాలువల వెంట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల లార్వాను చంపేందుకు, దోమల నివారణ కోసం నీటి మడుగులో ఆయిల్ బాల్స్ వేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన తానాకుర్థి రెడ్డి సంఘం ప్రతినిధులు



ఎమ్మెల్యే సన్మానించిన పలువురు

**నవతెలంగాణ-మోపాల్**

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని తానాకుర్థి గ్రామ రెడ్డి సంఘం ప్రతినిధులు రూరల్ క్యాంప్ ఆఫీస్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నిర్మిస్తున్న రెడ్డి సంఘానికి నిధులు కేటాయించాలని, గ్రామ అభివృద్ధి కూడా అత్యధిక మొత్తంలో నిధులు నిధులు మంజూరు చేయాలని ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో నిధులు మంజూరు చేస్తానని ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ విండో చైర్మన్ సూర్యరెడ్డి, మాజీ సర్పంచులు అనంతరెడ్డి, నారాయణరెడ్డి, అంగలి సాయరెడ్డి అంచ మహేందర్‌రెడ్డి, అంగలి సూర్యరెడ్డి, విజయ్, లింభారెడ్డి, ప్రశాంత్, అంగలి రవీందర్, పునాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న పలువురు

**నవతెలంగాణ-బోధన్**

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు, పాలకులు, ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎఫ్ బోధన్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో వీధీ కుక్కలు సంచారం అధికం కావడంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతే కాకుండా గత నాలుగు రోజుల క్రితం పట్టణంలో వీధీ కుక్కలు పలువురుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని తెలిపారు. ఆయిన కూడా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోలేదని కనీసం బాధితులను పరామర్శించలేదని ఆయన ఆరోపించారు. ఇక నైనా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పందించి బోధన్ మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బోధన్ అభివృద్ధిపై, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్ సత్యం, సీనియర్ నాయకులు మహ్మద్ రజాక్, కార్మిక విభాగం అధ్యక్షులు రవిశంకర్‌గౌడ్, ప్రవీణ్ నాయక్, అహమ్మద్, సాగర్, షేక్ జాకీర్ అహెమ్మద్, పాల్గొన్నారు.

# మహిళాల సమానత్వం కోసం బలమైన పోరాటాలు నిర్మించాలి

- ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

అన్ని రంగాలలో మహిళాల సమానత్వం కోసం బలమైన పోరాటాలు నిర్మించాలని ప్రగతి శీల మహిళా సంఘం (పివోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ అన్నారు. శనివారం నగరంలో ద్వారకానగర్ ఐఎఫ్టియు కార్యాలయంలో పివోడబ్ల్యూ నిజామాబాద్ జిల్లా 7వ మహాసభ నిర్వహించారు. ముందుగా పివోడబ్ల్యూ జెండాను జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువచ్చాయని, కానీ నేడు ప్రభుత్వాలు మహిళా చట్టాలను అమలు చేయటం లేదని అన్నారు. కోట్లాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు వెనక్కి తీసుకోపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం




మాట్లాడుతున్న ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

ఉందన్నారు. దేశ వ్యాప్తంగా వయస్సుతో సంబంధం లేకుండా మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు చేస్తున్నారని వాటిని అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్స్ అమలు చేయాలని, మత్తు పదార్థాలు, మద్యానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలో విప్లవాత్మక మార్పు కోసం మహిళలు చైతన్యవంతమై, బలమైన పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో వక్తలుగా వచ్చిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, పివోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పిట్ల సరితలు మాట్లాడుతూ.. ఆటవిక యుగం నుంచి సమాజ పరిణామ క్రమంలో అభివృద్ధిలో మహిళా పాత్రే కీలకమన్నారు. నేటికీ మహిళలు ప్రాధాన్యత ఉంటే మహిళ పథకాలు, మహిళల చుట్టూ రాజకీయాలు, దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారో అర్థం అవుతుందని తెలిపారు. ఈ సభకు అధ్యక్షత పివోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ వహించారు. ఈ సభలో పివోడబ్ల్యూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నీలం లక్ష్మి జి.సంజన, పద్మ, చిట్టెక్క, వెల్పూర్ లక్ష్మి, అనంతక్కా, భారతి, డిశెట్టి రాధ, పుష్పలత, అనురాధ శైలజ, 100 మంది మహాసభ ప్రతినిధులు, పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఇందల్‌వాయి మండలంలోని త్రియంబాకపేట్ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని రంజిత్ నాయక్ తండలోని గ్రామ పంచాయితీలో గల త్రియంబాక్‌పేట్ గ్రామ ప్రజలు బిసి ముధీరాజ్ ప్రజలు నివసిస్తున్నారని, గతంలోనే ఏర్పాటు చేసిన రంజిత్ నాయక్ తాండ గ్రామపంచాయితీ 100శాతం ఎస్‌టి గిరిజనులకు కేటాయించడం వల్ల త్రియంబక్‌పేట్ గ్రామంలోని బీసీ ప్రజలకి రిజర్వేషన్, అభివృద్ధి, రాజకీయంగా ఇలా చాలా విషయాలలో మా గ్రామానికి (త్రియంబక్‌పేట్) అన్యాయం జరుగుతుందని వారన్నారు.

ప్రభుత్వం ద్వార వచ్చే నిధుల కూడా మీ గ్రామానికి అందడం లేదనీ గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి విన్నవించారు. తాము, తమ గ్రామం అభివృద్ధి చేందలంటే త్రియంబక్‌పేట్ గ్రామనికి ప్రత్యేక




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నూతన గ్రామపంచాయితీ ఏర్పాటు చేస్తే తామంతా రూణపడి ఉంటామని వారన్నారు. అన్ని సమస్యలు విన్న ఎమ్మెల్యే తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలా అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, చిన్న సాయిలు, పోతన్న, గంగలస్మయ్య, పెద్ద బాలయ్య, సురేందర్, సాగర్, బాలకృష్ణ, గంగాదాసు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ప్రజలందరూ ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ అన్నారు. శనివారం సామాజిక ఆరోగ్య కేంద్రం డిచ్‌పల్లిలో జరుగుతున్న ఆరోగ్యమేల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ సందర్శించారు. ఈ ఆరోగ్య మేళాలు ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాలు కింద ప్రతినెల రెండవ శనివారం ప్రత్యేక వైద్య నిపుణులచే జరుపుతున్నమని, ప్రజలందరూ ఈ ఆరోగ్యమేళాను ఉపయోగించు కోవలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సుష్మ, దంత వైద్య నిపుణురాలు సరిత గ్రేస్‌లు రోగులకు శిక్షణ అందించారు. స్త్రీ వైద్య నిపుణురాలు స్త్రీలకు సంబంధించిన గైనకాలజీ సమస్యలకు స్కానింగ్ చేసి చికిత్స అందించారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ

ఆరోగ్యమేళాలో అందుతున్న సదుపాయాలను రోగులను అడిగి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాగరాజ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ సంతోషం

- ఏంఆర్‌పీస్ మండల అధ్యక్షులు టెంకటి సామెల్



మాట్లాడుతున్న నాయకులు

**నవతెలంగాణ-ఎడపల్లి**

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సంతోషానియమని ఏంఆర్‌పిస్ మండల అధ్యక్షులు టెంకటి సామెల్ అన్నారు. ఆయన న్యూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఏఆర్‌పిస్ సమావేశంలో పాల్గొని మాట్లాడ్డినట్లు సామెల్ తెలిపారు. దళిత సోదరు నాయకులు, మంద కృష్ణ మాదిగకు పూర్తి, మద్దత్తు ఇవ్వడం, పోరాటంలో పాల్గొనడంతో ఎస్సీ వర్గీకరణ సాధ్య మైందన్నారు. ఈ సందర్భంగా దళిత సోదరులు, నాయకులకు ఆయన ప్రతేక ధన్యవాదాలు తెలిపారు.

## నర్సింగ్‌పల్లి తిరుమల ఆలయానికి ఆవు అందజేత

- త్వరలో సందర్శిస్తా : ప్రముఖ సినీ గేయరచయిత రామజోగయ్య శాస్త్రీ



**నవతెలంగాణ-మోపాల్**


మండలంలోని నర్సింగపల్లి ఇందూరు తిరుమల గోవిందవనమాల క్షేత్రంలో ఉన్న గోశాలకు ప్రముఖ సినీ గేయరచయిత శ్రీ రామ జోగయ్య శాస్త్రీ గోదానం చేసారని ఆలయ ప్రధాన ధర్మకర్త నరేసిహరెడ్డి శనివారం తెలిపారు. అదే విధంగా ఆలయం కేంద్రంగా చేస్తున్న ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యాన్ని చూడడానికి త్వరలో వారు ఇందూరు తిరుమలను దర్శనం చేసుకుంటారని తెలిపారు. ఒకప్పుడు ఆలయాలు కేంద్రం జ్ఞానాన్ని, వివిధ రకాల సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు విరాజిల్లేవని, ఇప్పుడు ఇందూరు తిరుమల ఆలయం కూడ అదే కోవలో సేవలు చెయ్యడం గొప్ప విషయమన్నారు.

## కొవ్వొత్తులతో ర్యాలీ

**నవతెలంగాణ-ముప్కాల్**

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడిని నిరసిస్తూ శుక్రవారం రాత్రి క్రొవ్వొత్తులతో బీజేపీ నాయకులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. గాంధీ చౌక్ నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్ రెడ్డి, ముస్కు నర్సయ్య, చిల్క దినేష్, మ్యాక నర్సయ్య, కల్లు స్వామి, గోపీనాథ్, కొంద్ర ధన్‌పాల్, సాగర్, లోక రాములు, కింగ్స్ గంగాధర్, మాజిత్, శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ అందజేత



మొబైల్‌ను అందజేస్తున్న ఎస్సై

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని నీల గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇటీవల తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడంతో సిఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి పోగొట్టుకున్న మొబైల్ తిరిగి అప్పగించడం జరిగిందని ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. తాను పోగొట్టుకున్న మొబైల్ ఆపరేటర్ గణేష్ సేజ్ చేసి తిరిగి తన మొబైల్ తిరిగి ఇప్పిచ్చినందుకు పోలీస్ శాఖను ఆయన అభినందించారు.

## నూతన సబ్ రిజిస్ట్రార్‌గా మహేందర్‌రెడ్డి




సన్మానించిన పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణ సబ్ రిజిస్ట్రార్‌గా మహేందర్‌రెడ్డి శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని సబ్ రిజిస్టార్ కార్యాలయంలో సినియర్ అసిస్టెంట్ విక్రమ్ సింగ్‌లకు జిజి ఫౌండేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగి సదాశివ్, పిసి గంగారెడ్డి, అల్జపూర్ రాజేశ్వర్, హరినారాయణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఐదు కొత్త గ్రామాలు

**నవతెలంగాణ-పోతంగల్**



మండలంలో 5 కొత్త గ్రామాలు కలిసి మొత్తం 19 గ్రామాలయ్యాయి. కొత్త గ్రామాల జాబితాలో తిర్మలాపూర్, జల్లాపల్లి తాండ, జల్లాపల్లి (పాత) గ్రామం, బాకర్ ఫారం, శ్రీనివాస్‌రెడ్డి కాలనీ (రాంగంగానగర్)లను చేర్చారు. అన్ని గ్రామాలకు పోతంగల్ మండల కేంద్రమే కాక, పురాతన గ్రామం, ఆధ్యాత్మిక కేంద్రం, వ్యాపార కేంద్రం, అంగడికి ప్రసిద్ధి, తనకంటూ గుర్తింపు ఉన్న సహకార సంఘం, విద్యా కేంద్రం ఇంకా ఎన్నెన్నో.. గ్రామాలన్ని మంజీరా నది ఒడ్డున, సారవంతమైన భూములతో, పాడిపంటలతో, ప్రశాంతమైన వాతావరణంలో, ఆధ్యాత్మికతతో, మంచి మానవ సంబంధాలతో, ఆనందంగా జీవించే ప్రదేశాలే కాక, మహారాష్ట్రతో తత్సంబంధాలు, బంధుత్వాలు కలిగి, కర్ణాటక తోనూ మంచి సంబంధబంధవ్యాలతో, తెలుగు, మరాఠి, కన్నడ భాషలతో త్రివేణి సంఘంగా వెలుగొందిన ప్రదేశంగా చెప్పవచ్చు.

## 14న కాగడాల ప్రదర్శనను విజయవంతం చేయండి

- ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ దేశెట్టి సాయిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ దేశెట్టి సాయిరెడ్డి

**నవతెలంగాణ-మాక్లూర్**

ఈ నెల 14న కాగడాల ప్రదర్శన విజయవంతం చేయాలని ఎస్‌కేయం జిల్లా కన్వీనర్ దేశెట్టి సాయిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని బోర్గం(కె) గ్రామంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు చేయాలని ఎస్కేయం పిలుపునిచ్చిందన్నారు. కాగడాల ప్రదర్శనను రైతాంగం, కార్మిక రంగం, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తడకల కృష్ణగౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి, డి.బన్సీ, జిల్లా నాయకులు మేకల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ రూరల్ ఎస్సై బదిలీ

**నవతెలంగాణ-బోధన్**

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సైల బదిలీలను చేపట్టగా బోధన్ రూరల్ ఎస్సైగా పనిచేసిన నాగనాథ్ వేల్పూర్ మండల ఎస్సైగా అధికారులు బదిలీ చేశారు. కమ్మర్పల్లి మండల ఎస్సైగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను అధికారులు బోధన్ రూరల్ ఎస్సైగా బదిలీ చేశారు. ఆదివారం బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. అలాగే బోధన్ టౌన్ ఎస్సై-1గా ఎర్గట్ల మండలం నుంచి మచ్చేందర్‌ను బదిలీ చేశారు. బోధన్ టౌన్ ఎస్సై-2 గా కమీషనరేట్ వెయిటింగ్‌లో ఉన్న హబీబ్ ఖాన్‌ను బదిలీ చేశారు.

## వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న ఎస్సై

**నవతెలంగాణ-భిక్కనూర్**

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చంద్రశేఖర్‌గౌడ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల వాలీబాల్, కబడ్డీ పోటీలను శనివారం ఎస్సై సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఫోర్ సభ్యులు, అన్ని గ్రామాల జట్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కాసులను సత్కరించిన ఏనుగు వర్గం


బాలరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

నసురుల్లాబాద్ మండలంలోని బాస్వాయిపల్లి గ్రామానికి మొదటి సారిగా విచ్చేసిన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు ఘనంగా సన్మానించారు. టపాసులు కాల్చి, సీట్లు పంపిణీ చేశారు. దుర్కి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ఏనుగు వర్గీయులు ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో కొందరు ఏనుగు వర్గీయ యువకులు కలసి శాలువాతో సన్మానించారు. అక్కడి నుంచి వెళ్లి గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల వెళ్ళినారు. అలాగే మిర్జాపూర్ గ్రామస్తులు కూడా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరికా శ్రీనివాస్, కాలేక్, పురం వెంకటి, మారుతి పటేల్, పురం వెంకట్, బోయిని శంకర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి ఉంది.. వైద్యులు లేరు

- పెద్దకొడప్‌గల్‌కు ఇన్‌చార్జి వైద్యుడే దిక్కు
- ఏ సమయంలో ఉంటారో తెలియని దుస్థితి
- పొంచి ఉన్న సీజనల్ ముప్పు
- పేదోడికి అందని సర్కారీ వైద్యం
- ఉన్న ఒక్క ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది లేక రోగులకు ఇక్కట్లు


ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుడి కుర్చీ


వైద్యుడి కోసం నిరీక్షిస్తూ.. అక్కడే కుర్చీలపై పడుకున్న ఓ వ్యక్తి

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం. ఈ సీజన్‌లో పలు రోగాల బారిన పడిన వారితో ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సందర్భంలో ఆస్పత్రిలో వైద్యులతో పాటు సిబ్బంది సరిపడా ఉండి సకాలంలో వైద్యం అందించాల్సి ఉంటుంది. కానీ ఆ విధంగా లేకపోవడంతో వైద్యం కోసం ఆశగా వచ్చిన వారికి నిరాశే ఎదురవుతుంది. మండల నలుమూలల నుంచి 20 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి వచ్చిన వారికి వైద్యులు లేక ఖాళీ కుర్చీ దర్శనమిస్తుంది. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. పుల్కల్ వైద్యుడికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడంతో సదరు డాక్టర్ ఇక్కడికి ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియని దుస్థితి నెలకొంది. ఉన్న వారు సైతం సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఆస్పత్రిపై నవతెలంగాణ కథనం..

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీకి నలుమూల నుంచి రోగులు రావాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే. అవస్థలు పడి ఇక్కడికి వచ్చినా సరైన సౌకర్యాలు లేక నాణ్యమైన వైద్యం అందడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర ఇన్‌చార్జీ డాక్టర్ తప్ప పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రుకి వైద్యులు లేని వైద్యశాలగా మిగిలిపోయింది.

మండల కేంద్రంలోని ప్రథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది లేక గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు సర్కారీ వైద్యం అందని ద్రాక్షగానే మారింది. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, అటెండర్ ఉండాలి. కానీ ఇక్కడ ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. అయితే శనివారం మండలంలోని కాటేపల్లి తండాకు చెందిన పలువురు రోగులు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం నిమిత్తం వచ్చారు. ఆ సమయంలో డాక్టర్, ఫార్మసిస్ట్, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్ ఎవ్వరు లేకపోవడం గమనార్హం. జ్ఞానేశ్వర్ అనే స్టాఫ్ నర్స్ ఒక్కరే ఉండి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 100 మంది రోగులకు వైద్య చికిత్స అందజేశారు.


వైద్యం కోసం వచ్చి వైద్యుడి కోసం ఎదురుచూస్తున్న కాటేపల్లితండా వాసులు

సిబ్బంది లేకపోవడంతో వైద్యం కోసం మండల కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం తప్పడం లేదని జనాలు ఆరోపిస్తున్నారు. సామాన్య ప్రజలు ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలంటే దాదాపు 500, 1000, వందల రూపాయలు ఖర్చుఅ వుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సర్కారీ దవాఖానలో పూర్తి స్థాయి సిబ్బంది ఉంటే మెరుగైన వైద్యం అందుతుందని జనాలు ఆరోపణలు చేస్తున్నారు. వైద్యులు లేకపోవడంతో రోగులు గంటల తరబడి బయటనే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదవసాత్తు రోడ్డుప్రమాదం గాని విషపురుగులు కాటు వేయడంగాని జరిగితే వైద్యం అందక ప్రాణాలు కోల్పోయె పరిస్థితి కళ్ళకు కట్టినట్లుగా కన్పిస్తుందని మండల ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఒక్క డాక్టర్ లేకపోవడంతో ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు భరోసా ఇచ్చేది ఎవరని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేయడం ఇదేనా అని అడుగుతున్నారు. ఖాళీల స్థానాల్లో నియామకం చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వైద్య సిబ్బందిని వెంటనే భర్తీ చేసి ప్రజలకు కావలసిన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు

### ఎప్పుడు వచ్చినా వైద్యులు ఉంటలే

**సైమల్ కాటేపల్లి తండా**



ఎప్పుడు వచ్చినా వైద్యులు ఉండటం లేదు. గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. లేదంటే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రైవేటు ఆసుపత్రిలో చూపెట్టుకునే అంత స్తోమత మాకు లేకే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నాం.

### కనీసం ప్రథమ చికిత్స అందట్లే

**దేవి సింగ్ కాటేపల్లి తండా**



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలను బలోపితం చేస్తామని చెప్పి కనీసం ప్రథమ చికిత్స చేసేందుకు కూడా సమయానికి వైద్యులు ఉండటం లేరు. ఏదైనా గాయం తగిలి ఆసుపత్రికి వెళ్తే కనీసం కట్టు కట్టడానికి అటెండర్ కూడా ఉండటం లేదు. ఇప్పటికైనా ఈ పరిస్థితులను మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

## హాజిపూర్‌లో ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన్న మెడికవర్ హాస్పిటల్

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్ గ్రామంలో గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్, మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ నిజామాబాద్ వారి వైద్యుడు డాక్టర్ విష్ణు శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య సూచనలు ఇస్తూ ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి వైద్య సహాయం అందించి ఉచితంగా గా మందులు కూడా అందించారు. ఈ సందర్భంగా గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ వ్యవస్థాపకులు నరేష్ రాథోడ్ మాట్లాడుతూ వర్షాకాలం మొదలవుతున్న సందర్భంగా విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించడానికి బీపీ, షుగర్ లాంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి పేద ప్రజలకు వైద్య సహాయం అందించడానికి ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంకు కనీస సౌక్యాలు కల్పించి విజయవంతం చేసిన మాజీ గ్రామ సర్పంచ్ అరిగే చంటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ విఠల్, భాస్కర్, కిషన్ భవసింగ్ బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో 24 యూనిట్లు సేకరణ


రక్తదానం చేస్తున్న యువకులు

**నవతెలంగాణ-లింగంపేట్**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లింగంపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో కొర్పోల్ గ్రామంలో రక్తదాన శిబిరాన్ని మాజీ సర్పంచ్ మంజూల నర్సింలు, గ్రామ యువత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన్నట్లు మండల రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 24 యూనిట్ల రక్తదానం చేశారని అన్నారు. కొర్పోల్ గ్రామం చిన్నదైనప్పటికీ ఆ గ్రామంలో యువకులు ముందుకు వచ్చి 24 యూనిట్ల రక్తధానం చేయడం స్పూర్తిదాయకమని,చిన్న గ్రామలలో సహితం రక్తదానం చేయడంపై ఉన్న అపోహలను తొలగిస్తూ మేము సైతం రక్తదాతలం అవుతామంటు ముందుకు వచ్చిన గ్రామ యువకులను రెడ్ క్రాస్ సొసైటీ తరఫున ప్రత్యేకంగా అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షు లు రవి గౌడ్ 25వ సారి రక్తదానం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రవి గౌడ్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వివేకానంద, కాళిదాస్, రసూల్, ప్రవీణ్ కుమార్, నాగరాజు, రెడ్ క్రాస్ సిబ్బంది ప్రమోద్ గౌడ్,అమర్నాథ్,సాయి కృష్ణ పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ కలిసిన చిన్ననాటి మిత్రులు



**నవతెలంగాణ-రామారెడ్డి**

జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ సునందరెడ్డిని శనివారం చిన్ననాటి మిత్రులు హైదరాబాదులోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. 1993-94లో రామారెడ్డిలో పదవ తరగతి చదువుతున్న రోజుల్లో జరిగిన తీపి విషయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సునంద రెడ్డి, మిత్రులు అడ్డ గుల్ల శ్రీనివాస్, నామాల రవి, ప్రభాకర్, అబ్బా లింగం, రమేష్, హరికిషన్, శ్రీనివాస్ గౌడ్, సాయిబాబా, కుమార్, రవి, శారద, కవిత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు

## వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు


వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి పట్టణంలోని వడ్డేపల్లి సుభాష్ రెడ్డి నివాసంలో ఆయనను భారీ గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆఫీస్ పటేల్, కాశీరాం, పరంధాములు, శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవులు, యూనిస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-రామారెడ్డి**

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, మార్చ్‌ఫాస్ట్ కార్యక్రమానికి విద్యార్థులకు హ్యాండ్ గ్లౌజ్, టోపీల కోసం జిల్లా పరిషత్ పాఠశాల పోసానిపెట్ విద్యార్థులకు, గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నా రెడ్డి సువర్ణ శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రూ.5000 ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసినందుకు సువర్ణ శ్రీనివాస్ రెడ్డిని పలువురు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీకి

# బాన్సువాడలో ఇన్‌చార్జి లేరు.. ఉండరు

- వలస నాయకుల మాటలు నమ్మొద్దు
- రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసులబాలరాజ్


మాట్లాడుతున్న రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసులబాలరాజ్

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం పలాలు అందుతాయని, బాన్సువాడ నియోజకవర్గంలో ఇక కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఎవరు లేరు, ఉండరని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బలారాజ్ అన్నారు. శనివారం నసురుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్, దుర్కి, బస్వాయిపల్లి, కంషెట్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. నసురుల్లాబాద్ మండలానికి రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్ రాక సందర్భంగా మిర్జాపూర్, దుర్కి, బస్వాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

మిర్జాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆందోళనకు గురికాకుండా ఏదైనా సమస్య ఉంటే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌కు గానీ నాకు గాని నేరుగా వచ్చి కలవాలని సూచించారు. వలస వచ్చిన నేతల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామ అభివృద్ధికై కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ మద్దతు ఇస్తేనే కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌తో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఏదైనా నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేక పోతే ఆ నియోజకవర్గం పార్టీ ఇన్ ఛార్జ్ ఉంటారు. అందుకనే ఆ రోజు మాజీ మంత్రి షబ్బీర్ అలీ అలా సూచించారు అని.. కానీ బాన్సువాడ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఇద్దరు ప్రభుత్వ నేతలు ఉన్నారని అన్నారు. ఒకే నియోజకవర్గంలో ఇద్దరు ప్రభుత్వ నేతలు ఉన్న చోట మరో పార్టీ ఇన్ ఛార్జ్ అవసరం లేదని అన్నారు. మిర్జాపూర్ గ్రామంలో మైనార్టీ భవనానికి నిధులు మంజూరు కృషి చేస్తానన్నారు.

**వలస నేతల మాటలు తియ్యగానే ఉంటాయ్..**

వలస నేతల మాటలు తియ్యగానే ఉంటాయని, నియోజకవర్గం అభివృద్ధికై ప్రతి యువకులు గ్రూప్ రాజకీయాలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలతో నేను నాతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని, నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజలతోనే ఉంటానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు యువజన ఎన్నికలు ఉన్నాయని యువజన ఎన్నికల పట్ల , కాంగ్రెస్ పార్టీ పట్ల యువజన నాయకులకు అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించే వాటిని గుర్తించి ఎన్నుకోవాలని యువకులను సూచించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, దామరంచ శంకర్, సీనియర్ నాయకులు కాలిక్, కంది మల్లేష్, అంకోల్ రాము, పురం వెంకటి, యూసుఫ్, ఇక్బాల్, అంబెం మోహన్, భాను గౌడ్, సాయిలు, ప్రతాప్ సింగ్, అజీమ్, అసద్ బాయి,దుర్కి మోహన్, మహేష్ పటేల్, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తాం

- ప్రజలూ సహకరించాలి : ఎస్ఐల సూచన
- నూతన ఎస్ఐలకు పలువురి సన్మానం


నాగిరెడ్డిపేట్: ఎస్సైని సన్మానిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు


రామారెడ్డి: ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-విలేకరులబృందం**

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పలువురు ఎస్ఐలు తెలిపారు. అందుకు ప్రజలూ సహకరించాలని కోరారు. పలు మండలాల్లో బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలను ఆయా పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

**దోమకొండ :** దోమకొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై ఆంజనేయులును కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్ నాయకులు శనివారం శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ మండలం లోని ఆయా గ్రామల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తామని, ప్రజలు సహకరించాచలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ షమ్మీ నహీమ్ ,రాజు, రవి ఉన్నారు.

**ఎస్ఐకి సన్మానం**

**మద్నూర్ :** మద్నూర్ నూతన ఎస్సైగా విజయ కొండ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్సై కి శనివారం మద్నూర్ మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మద్నూర్ మండల బి ఆర్ ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు సచిన్ పటేల్, యువ నాయకులు రవి, రాజు, మారుతి పాల్గొన్నారు సన్మానించిన యువకులకు నూతన ఎస్సై ధన్యవాదాలు తెలియజేశారు.

**ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు**

**సదాశివనగర్:** సదాశివనగర్ మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై రంజిత్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు శనివారం శాలువతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్ పాటిల్, జైపాల్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో**

సదాశివనగర్ ఎస్ఐ రంజిత్ కుమార్‌ను బిజెపి మండల అధ్యక్షుడు కుంట రాంరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూంరావు ,హోటల్ మోహన్, జైపాల్ రెడ్డి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

**ఎస్ఐ సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు**

**నాగిరెడ్డిపేట్ :** నాగిరెడ్డిపేట్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మల్లారెడ్డిని శనివారం బీఆర్ఎస్ నాయకులు షాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు కృష్ణ, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, సంతోష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**ఎస్సైని సన్మానించిన నాయకులు**

**రామారెడ్డి :** మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాస్ ను శనివారం మాజీ సర్పంచ్ దండ బోయిన సంజీవ్ తో పాటు పలువురు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలు కాపాడడానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు డాక్టర్ సుధాకర్, గుర్జకుంట స్వామి, మంద భూమయ్య, ఉప్పే సాయిలు, లింగాపురం శంకర్, ఉప్పే రాజేందర్ తదితరులు ఉన్నారు.


సదాశివనగర్‌లో..


మద్నూర్: ఎస్సైని సన్మానిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు


దోమకొండ: ఎస్ఐని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | ఆగస్టు 11, 2024 | www.navatelangana.com


## శివనామ సప్తలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నవతెలంగాణ-మద్నూర్**

మండల కేంద్రానికి పూర్తిగా సరిహద్దులో గల మహారాష్ట్రలోని దేగ్లూర్ పట్టణంలో జరుగుతున్న శివనామ సప్త కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు శనివారం పాల్గొన్నారు. నిర్వాహకులు, పూజారులు మాజీ ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయనవెంట బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వై.గోవింద్, సింగిల్ విండో మాజీ చైర్మన్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

## సెల్ ఫోన్‌లు అందజేత

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రైలులో పోయిన రెండు సెల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి సెల్‌ఫోన్ బాధితులకు అప్పగించినట్టు నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని రైల్వే పోలీస్ స్టేషన్ ఆవరణంలో బాధితులకు సెల్‌ఫోన్‌లను అప్పగించారు. అలాగే ఎవరైనా ట్రైన్‌లో టికెట్ తీసుకొని ప్రయాణం చేసినప్పుడు వారి యొక్క ఫోన్స్ పోయినట్లయితే వెంటనే దగ్గరగా ఉన్న మీ సేవా కేంద్రంలో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చేసుకోగలరని తెలియజేశారు. వాటిని పోలీసులు ట్రేస్ చేసి ఇవ్వగలమని, లేదా తమ రైల్వే పోలీసు స్టేషను నిజామాబాద్‌కు వచ్చి సంప్రదించగలరని తెలియజేశారు.



సెల్‌ఫోను అందజేస్తున్న ఎస్సై

## 30 ఏళ్ల పోరాటంతో ఫలించిన ఎస్సీ వర్గీకరణ

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాన్నిస్తూ తీర్పు ఇవ్వడంతో మండలంలోని జాగిర్యాల గ్రామం డా.బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దండోరా సంఘ సభ్యులందరి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం మందకృష్ణ మాదిగ పోస్టర్‌కి పాలాభిషేకం శనివారం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని విషాధికిరించి వర్గీకరణ పోరాటం న్యాయబద్ధమైనదని సుప్రీంకోర్టు ఏడుగురి న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పునివ్వడంతో రాష్ట్రంలో మాదిగలు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో భాగంగా మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గుర్తించి గౌరవించి ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితాన్ని అందించిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జాగిర్యాల దండోరా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## సుబాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**నవతెలంగాణ-సదాశివనగర్/రామారెడ్డి**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సుబాష్ రెడ్డి జన్మదిన వేడుకలలో సదాశివనగర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సదాశివనగర్ కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొని సుబాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, సంతోష్ పాటిల్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రామారెడ్డి :** వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, పారిశుధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ జిల్లా పరిషత్‌లో లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జి రెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బి పేట నర్సింలు, మహమ్మద్ అనీఫ్, చింతకుంట కిషన్, బొమ్మిడి రఘుపతిరెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ

**నవతెలంగాణ-మద్నూర్**

లోక్‌సభ స్పీకర్‌ను జహీ రాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ శనివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం గురించి వివరించినట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## నేడు చలో రవీంద్ర భారతి

**నవతెలంగాణ-కామారెడ్డి**

హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నేడు జరిగే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలకు భారీ ఎత్తున గౌడ సోదరులు తరలిరావాలని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాంగోళ్ల మురళిగౌడ్ శనివారం పిలుపునిచ్చారు. గత 17 సంవత్సరాలుగా జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గౌడ సోదరులందరూ భారీ ఎత్తున హాజరు కావాలని కోరారు.

## విజయోత్సవ సభకు తరలి రావాలి

**నవతెలంగాణ-మద్నూర్**


ఎస్సీ వర్గీకరణ కోసం కోర్టు తీర్పుతో మాదిగలకు న్యాయం చేకూరుతుందని సుప్రీంకోర్టు తీర్పు మూలంగా విజయోత్సవ సభ నిర్వహించడానికి బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభకు జుక్కల్ నియోజకవర్గంలోని మాదిగ సోదరులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు శనివారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. నేడు ఉదయం 10:30 గంటలకు బిచ్కుంద మార్కెట్ యార్డులో జరుపుకునే విజయోత్సవ సభకు తరలివచ్చే జనాలందరికీ భోజన వసతి కల్పించినట్టు తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమం కొరకే వెల్ఫేర్ కమిటీ

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎల్లవేళలా సమయాన్ని కేటాయిస్తూ అలుపెరుగని కృషి చేస్తామని జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గంగారెడ్డి అన్నారు. శనివారం జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పడిన వెల్ఫేర్ సొసైటీ (2024-25) కార్యవర్గానికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గంగారెడ్డి మాట్లాడుతూ.. మాపై నమ్మకంతో వెల్ఫేర్ సొసైటీకి ఎన్నుకున్నందుకు కమిటీ కోసం ఎల్లవేళలా సమయాన్ని కేటాయిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేస్తామని అన్నారు. ఏ ఒక్క జర్నలిస్టు కష్టాల్లో ఉన్న ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటామని అన్నారు. అందరి సహకారంతో సేవలు అందిస్తామన్నారు. ఈ నియమకానికి సహకరించిన అన్ని జర్నలిస్టు సంఘాలకు, ప్రెస్ క్లబ్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కొట్టురు శ్రీనివాస్, పంచారెడ్డి శ్రీకాంత్, వాగ్మరే సుభాష్, కర్క రమేష్, కొక్కు రవికుమార్, సదానంద్, హైమద్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి గెలుపు కోసం ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-మద్నూర్**

ఉమ్మడి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం కాంగ్రెస్ పార్టీ ఐకమాండ్ ప్రతిపాదించిన హనుమంతు యాదవ్ గెలుపు కోసం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు, పార్టీ సీనియర్ నాయకు లు శనివారం మండలంలోని పెద్ద ఎక్లార గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల నాయకుల వెంట యువకుడు బండి వార్ హనుమాన్లు పాల్గొన్నారు.

## వడ్డివ్యాపారుల వేధింపులతోనే

# రైతు కుంట రాజేశ్ బలవన్మరణం

- వడ్డి వ్యాపారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- రూ.10 లక్షల ఆర్థిక సహాయ అందజేయాలిఅందించాలి
- అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక రాష్ట్ర ప్రతినిధులు వి ప్రభాకర్, దేవారం

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని వేధించిన వడ్డీ వ్యాపారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని , రాష్ట్రవ్యాప్తంగా ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, రాజేష్ కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని రాష్ట్ర అఖిలభారత ప్రగతిశీల వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రతినిధులు వి ప్రభాకర్, దేవారం శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల పరిధిలోని అర్గుల్ గ్రామంలో కుంట రాజేష్ రైతు ఆత్మహత్యపై అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, ఉమ్మడి ప్రతినిధులు నిజనిర్ధారణ సేకరణ శనివారం నిర్వహించారు. వాస్తవాలు సేకరించడానికి ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి దేవారం, జిల్లా అధ్యక్షులు సారా సురేష్, నాయకులు బి బాబన్న, గంగారాం, గంగాధర్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కే. గంగాధర్, దేవన్న, పి డి ఎస్ యు పి డి ఎస్ సి జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ కుమార్‌తో కూడిన ప్రతినిధి బృందం గ్రామంలో పర్యటించి వివరాలు ఆరా తీసింది.

ఈ సందర్భంగా నాయకులు వివరాలు వెల్లడించారు. 'కుంట రాజేశ్(42)కు ఉమ్మడి కుటుంబంలో ఎకరం 20 గుంటల భూమి తన భాగంగా వచ్చింది. తనకి ఇద్దరుమారులు. పెద్దబాబు ఇంటర్మీడియట్. చిన్నబాబు 9వ తరగతి చదువుతున్నాడు.. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన ఎకరం 20 గుంటల భూమిలో వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపడలేదని 13 సంవత్సరాలు దుబాయ్, కత్తర్ దేశాలకు వెళ్లి అక్కడ పనిచేశాడు. వచ్చిన తర్వాత 14 ఈసాల భూమిని కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కు ధరణి ఆటంకాలతో రిజిస్ట్రేషన్ కాలేదు. ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన ఎకరం 20 గుంటలు కూడా తన పేరు నమోదు కాలేదని ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. సాగుకు నీళ్ల సౌకర్యం లేక 550 ఫీట్ల వరకు బోర్ వేశాడు. నీళ్లు పడలేదని మరొక బోరు 450 ఫీట్లు వేశాడు. అందులోని సైతం నీళ్లు పడలేదు. కానీ అప్పుల భారం పెరిగింది. అప్పులు తీర్చడానికి ఇటుక బట్టీల వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఇటుక బట్టి వ్యాపారంలో సైతం కూలీలు సహకరించకపోవడంతో అప్పుల పాలయ్యాడు. గ్రామంలో ఫైనాన్స్ వడ్డీ 100కు మూడు రూపాయల చొప్పున 50 లక్షలకు పైగా అప్పు చేయడంతో నెలకు 80 వేల రూపాయలు వడ్డీలకే అప్పులు తెచ్చి కట్టడం అప్పుల భారం పెరిగిందని కుటుంబ సభ్యులు రోదిస్తూ చెప్పారు.

మరొక 30 లక్షల వరకు రెండు రూపాయల వడ్డీల కాడికి స్నేహితుల దగ్గర, మహిళా సంఘాల ,దగ్గర అప్పులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫైనాన్స్ అప్పులు ఇచ్చిన వారు ఇంటికొచ్చి హెచ్చరించారని, ఫోన్లో ఈ నెల 18వ తేదీ వరకు కట్టకపోతే బాగుండదని హెచ్చరించారని తమ ఆవేదనలు గుర్తు చేశారు.'



మాట్లాడుతున్న నాయకులు

ఎలాంటి చట్టబద్ధత లేని ఫైనాన్స్ వ్యాపారులు ఒత్తిడి మూలంగా, తమకున్న భూముల అమ్మడానికి ధరణి కలిగించిన ఇబ్బందులతో భూములు అమ్మకాలు జరగకపోవడంతో అప్పులు తీర్చలేని స్థితిలో ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి తన ముందు ఏ మార్గం కనిపించలేదని ఆత్మహత్యే మార్గంగా ఎంచుకున్నాడని తాము భావిస్తున్నట్టు తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం కలిగించిన ధరణి శాపం మూలంగా ధరణి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం మూలంగా ఒక యువ రైతు నిండు ప్రాణం పోయిందని దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేఅరు. రైతు బీమా కింద వచ్చే ఐదు లక్షలు.. కుటుంబానికి మరో ఐదు లక్షలు మొత్తం 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని, పిల్లలకు ప్రభుత్వమే ఉన్నత చదువులు చదివించాలని డిమాండ్ చేశారు.

ఫైనాన్స్ వేధింపులకు గురిచేసినవడ్డీ వ్యాపారుల పైన క్రిమినల్ కేసులు పెట్టి వడ్డీలకు వడ్డీలు వసూలు చేసిన మొత్తం రుణాన్ని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ధరణి సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని లేనియెడల ఇలాంటి ఆత్మహత్యలు మరెన్నో జరిగే అవకాశం ఉంద రైతు ఆత్మహత్యలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రైతులకు అన్ని పంటలకు మద్దతు ధరపై అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ధర ఇవ్వాలని.. సాగులో ఉన్న రైతులు అందరికీ రైతు భరోసా ఇవ్వాలని.. కాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# కారు చోరీచేసేందుకు హత్యాయత్నం

- కారుతో ఉడాయించిన దుండగులు
- గంటల వ్యవధిలోనే భార్యాభర్తను పట్టుకొని అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు

**నవతెలంగాణ-లింగంపేట్**

ఇన్నోవా కారు చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసులు వెల్లడించారు. శనివారం రాత్రి లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

లింగంపేట్ మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ధ్యారా బోయిన శ్రీకాంత్, అతని భార్య అనిత గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాదులోని చింతల్ బస్తీలో నివాసం ఉంటున్నారు. రోజువారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా.. డబ్బులు సరిపోకపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా నేరాలకు తెరతీశారు. నిందితుడు శ్రీకాంత్ పై 8 కేసులు ఉన్నాయి. గతేడాది హత్య కేసులో సంగారెడ్డి జైలుకు వెళ్లాడు. కాగా బాలనగర్‌లో ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌కుచెందిన గూడవల్లి స్టీవెన్ ఓ కేసులో అదే జైలుకు వెళ్లాడు. అక్కడ నిందితుడు శ్రీకాంత్.. స్టీవెన్‌తో పరిచయం చేసుకున్నాడు.

నిందితుడు నెల రోజుల క్రితం జైలు నుండి బయటకు వచ్చాడు. స్టీవెన్ ఇన్నోవా కారులను కిరాయికి నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో జైల్లో పరిచయం ఏర్పడగా నిందితుడు శ్రీకాంత్ ఉపాధి చూపుమని ఆయనను కోరగా చూపుతానని హామీ ఇచ్చాడు. కాగా శ్రీకాంత్ ఆయన భార్య పథకం ప్రకారం ఇన్నోవ వాహాన్ని చోరీ చేసేందుకు పథకం పన్నారు. దీంట్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకాంత్ అనిత సొంత ఊరికి వెళ్లడానికి పథకం తీశారు. అదే రోజు రాత్రి సికింద్రాబాద్లోని ప్యాట్నీ సెంటర్ వద్దకు వచ్చి స్టీవెన్‌కు ఫోన్ చేసి తాము తమ స్వగ్రామం కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం కన్నాపూర్ గ్రామానికి వెళ్తున్నామని అందుకు వాహనం కావాలని ఆయనకు ఫోన్లో వివరించారు. ఇద్దరిని నమ్మిన స్టీవెన్ ఇన్నోవా వాహనం తీసుకొని ప్యాట్నీ సెంటర్ వద్దకు వచ్చారు. అంత దూరం వెళ్లాలంటే 5 వేల రూపాయల కిరాయి అవుతుందని ఆయన వారితో అన్నారు. కిరాయి డబ్బులు స్వగ్రామం చేరుకొని ఇస్తామని వారు నచ్చజెప్పారు. దీంతో నర్సాపూర్ మెదక్ మీదుగా స్వగ్రామమైన కన్నాపూర్ గ్రామ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో రాత్రి ఒంటిగంట ప్రాంతంలో అటవీ ప్రాంతంలో ఆపుకొని మూత్రానికి వెళ్దామని పథకం ప్రకారం నిందితుడు శ్రీకాంత్ అతని భార్య అనిత ఇద్దరు దిగారు. మీరు కూడా మూత్రానికి దిగండి అతనికి సూచించడంతో అతను దిగాడు. అర్ధరాత్రి అటవీ ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తున్న సమయం వెనక నుండి తలపై బలంగా స్టీవెన్‌ను శ్రీకాంత్ ఆయన భార్య బలంగా కొట్టారు. అంతే కాకుండా ఇద్దరు కలిసి చున్నీతో అతని మెడకు వేసి గుంజడంతో ఆయన అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. ఇది గమనించిన నిందితులు మృతి చెందాడని పక్కన పొదల్లోకి అతడిని పడేసి అతడి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లను, ఇన్నోవ కారును తీసుకొని అక్కడ నుండి పరాయిరయ్యారు. స్పృహ నుంచి మేలుకొన్న స్టివెన్ పోలీస్ స్టేషన్కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డి సిఐ రవీందర్, లింగంపేట ఎస్సై చైతన్య కమార్ రెడ్డి టెక్నికల్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ నేతృత్వంలో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో వాహనం ఏ ప్రాంతంలో ఉందో గుర్తించారు. కారులో వెళ్తుండగా.. డీజిల్ అయిపోవడంతో అటవీ ప్రాంతంలో ఓ పక్కన కారును నిలిపేశారు. స్వగ్రామం కన్నాపూర్ వెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారిని అదుపులో తీసుకొని వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు ఒక పర్సు ఇనోవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

**పోలీసులను అభినందించిన ఎస్పీ**

వాహనం చోరి కేసులో చాకచక్యంగా నింతులు పట్టుకున్న ఎల్లారెడ్డి సిఐ రవీందర్ లింగంపేట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి టెక్నికల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తో పాటు బృందంలో ఉన్న పోలీసులు జిల్లా ఎస్పీ సింధు శర్మ అభినందించారు. వీరికి నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. 24 గంటలు వ్యవధిలోనే సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకోవడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ రంగారావు కానిస్టేబుల్ శంకర్ రాజు పోలీసులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి



మృతి చెందిన గంగవ్వ

**నవతెలంగాణ-పోతంగల్**

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సందీప్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోవూరు గంగవ్వ (65) కాలకృత్యాల నిమిత్తం చెరువు వద్దకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మృతి చెందింది. ఆమె కుమారుడు గోవూరు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం

**నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్**

మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన జయపాల్ హన్మంతరావు అనే వ్యక్తి భార్యతో గొడవపడి అదృష్టం అయినట్టు వేల్పూర్ ఎస్సై శనివారం తెలిపా రు. మహారాష్ట్రకి చెందిన ఇతను నెల రోజుల క్రితం భార్య ఆశ రాణితో పాటు జానకంపెట్ గ్రామానికి వచ్చి కూలి పని చేసుకొని జీవిస్తున్నారు, శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడి ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లి పోయాడు, ఎక్కడ కూడా అతని ఆచూకీ లభించలేదని భార్య ఆశా రాణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు. ఇతను ఇంట్లో నుంచి వెళ్లి పోయినప్పుడు ఎర్ర రంగు చొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతను ఎవరికైనా కనిపిస్తే 8712659862 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



హన్మంతరావు

# ప్రభుత్వ నిబంధనలు పట్టట్లే

- రెండో శనివారం ప్రయివేటు పాఠశాలలు నడుస్తున్న వైనం

**నవతెలంగాణ-ఆర్మూర్**

ప్రైవేట్ పాఠశాలలు.. ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్-ఏబీవీపీ నాయకులు శనివారం తెలిపారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సెలవు దినమైన రెండో శనివారం పాఠశాలలు నడుపుతున్నటువంటి పాఠశాల ముందు ధర్నా చేపట్టి బంద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి పాఠశాలల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, విద్యాశాఖ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ, ప్రభుత్వ సెలవు దినమైన రెండో శనివారం పాఠశాలలు నిర్వహిస్తూ విద్యార్థులకు విశ్రాంతి లేకుండా మానసిక ఒత్తిడి పెంచుతున్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రీతం, ఏబీవీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




స్కూల్‌ను మూసివేయిస్తున్న విద్యార్థిసంఘం నాయకులు

## ప్రపంచ మానవ హక్కుల సంస్థ ప్రధాన కార్యదర్శిగా ముదాం శ్రీధర్

**నవతెలంగాణ-కామారెడ్డి**

ప్రపంచ మానవ హక్కుల సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముదాం శ్రీధర్‌ను శనివారం నియమించారు. భిక్నూర్ మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన ముదాం శ్రీధర్ సొంత ఊర్లో పేద కుటుంబాలకు నిత్యావసర సరకులు ఇస్తూ, ఊళ్ళో ఎవరైన మరణించినటువంటి అట్టి కుటుంబాలకు తన వంతు ఆర్థిక సహాయం చేస్తూ, ఎవరికి రక్తం కావాలన్నా క్షణాల్లోనే రక్తం అవసరం ఉన్న వాళ్ళకి రక్తం ఇప్పిస్తూ, తాను ఇస్తూ కొన్ని వేలమంది జీవితాలను కాపాడిన గొప్ప వ్యక్తి అని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సేవలు గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను మరిన్ని సామాజిక సేవలు చేస్తూ ముందుకు వెళ్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.